క్లుప్తంగా

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కామేపల్లి: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కొత్త లింగాల విద్యుత్ శాఖ ఏడీఏ వై.వీ.ఆనంద్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు, ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిన, స్తంభాలు విరిగినా వెంటనే సమీప సబ్ స్టేషన్ లేదా టోల్ ఫ్రీ నంబర్ 9440811525ను సంప్రదించాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కామేపల్లి: మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన వరికోల్లు వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు గురువారం గ్రామానికి చెందిన వట్టి శ్రీనివాస్, రెడబోతు సత్తిరెడ్డి, నలబోలు వెంకటరెడ్డి, పడిగా వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

కార్మికుడి కుటుంబానికి రూ.10 వేలు



ఆర్థిక సాయం అందిస్తున్న మాధవరావు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ట్రాలీ వర్కర్‌గా పనిచేస్తున్న యల్లం పుల్లయ్య(55) అనారోగ్యంతో గురువారం మరణించారు. దీంతో నగరంలోని బోస్‌బొమ్మ సెంటర్‌లో నివాసం ఉంటున్న ఆ కార్మికుడి కుటుంబానికి కార్మిక నేత(ఐఎన్‌టీయూసీ) నున్నా మాధవరావు దహన సంస్కారాల నిమిత్తం రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్త సైదిరెడ్డి, వెంకన్న, రామయ్య, శంకర్, రామకృష్ణ, వెంకటప్పయ్య, రమేష్, పాషా, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ లీగల్ సెల్‌లోకి జనార్ధన్

ఖమ్మంలీగల్: ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది సింగం జనార్ధన్‌కు గురువారం కరీంనగర్‌లోని కాంగ్రెస్ లీగల్ సెల్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ కండువా కప్పి కాంగ్రెస్ లీగల్ సెల్‌లోకి ఆహ్వానించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. న్యాయవాదుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ లీగల్ సెల్ పనిచేస్తుందని, 41ఎ సీఆర్‌పీసీ చట్ట సవరణకు, న్యాయవాదులందరికీ ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల మంజూరు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. జూనియర్ న్యాయవాదులకు కాంగ్రెస్ లీగల్ సెల్ అండగా ఉంటుందని చెప్పారు.

బీఆర్‌ఎస్‌కు మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ రాజీనామా

కూసుమంచి: మండలంలోని పోచారం గ్రామానికి చెందిన మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి గురువారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. ఈమేరకు తన రాజీనామా లేఖను పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుకు పంపించారు. తన సోదరుడు వరుసైన రామసహాయం రఘురాంరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్నందున అతడికి తన సంపూర్ణ మద్దతు ఇచ్చేందుకు రాజీనామా చేసినట్లు లేఖలో పేర్కొన్నారు.

గాయత్రి హోమం


ఖమ్మంగాంధీచౌక్: దేవతల అనుగ్రహం కోసం నగరంలోని శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న శ్రీ శాస్తా దేవస్థానం(అయ్యప్ప ఆలయం)లో గురువారం గాయత్రి హోమాన్ని నిర్వహించారు. దేవస్థానం 38వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కేరళకు చెందిన తంత్రులు, పూజారులు దేవతల అనుగ్రహం కోసం శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చిల్లంచర్ల రాధాకృష్ణ, రాయపూడి వెంకటరమణ, కోశాధికారి పసుమర్తి రంగారావు తదితరులు పాల్గొని పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	28	బచ్చలికూర	5
వంకాయ	20		20
బెండకాయ	36	పాలకూర	2
పచ్చిమిర్చి	74		10
కాకర	56	చుక్కకూర	2
బీర	64		10
దొండ	34	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	110	గోంగూర	2
గోరుచిక్కుడు	48		10
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	50		30
క్యారెట్	46	పుదీన	1
క్యాప్సికం	80		20

–ఖమ్మం వ్యవసాయం

క్యూట్‌గా ఓ సెల్ఫీ..



ఓటర్లను ఆకర్షించేందుకు ఎన్నికల సంఘం కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. గతంలో ర్యాలీలు, ప్రదర్శనలు, 2కే రన్‌లు, కళాజాతాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేది. తాజాగా సెల్ఫీ పాయింట్ల ద్వారా ఓటు వేసే కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నారు. రద్దీ ప్రాంతాలే లక్ష్యంగా అధికారులు వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

ఓటర్లను ఆకట్టుకునేలా సెల్ఫీ పాయింట్లు

- పోలింగ్ శాతం పెరిగేలా విస్తృత ప్రచారం
- ప్రధాన ప్రాంతాలు, షాపింగ్ మాల్స్ వద్ద ఏర్పాటు
- ఓట్ల పండుగ పేరుతో రూ.20వేల ప్రైజ్ మనీ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని పలు ప్రధాన ప్రాంతాలు, షాపింగ్ మాల్స్ వద్ద సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. రద్దీగా ఎక్కువగా ఉండే ప్రాంతాలతో పాటు షాపింగ్ మాల్స్ వద్ద రద్దీ ఎక్కువగా ఉండడంతో అక్కడకు వచ్చే వారికి ఓటు వేసే విధానంపై అవగాహన కలిగేలా వీటిని ఏర్పాటు చేశారు. కాగా, వీటిని చూసిన వారంతా అక్కడ ఓ ఫొటో దిగుతూ.. అవగాహన పొందుతున్నారు.

విస్తృత ప్రచారం ఇలా..

ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించిన అధికార యంత్రాంగం కొత్తగా ఓటు వచ్చిన ఓటరుకు ఓటరు గుర్తింపు కార్డుతో పాటు ఓటు వేసే విధానం, ఓటరు ప్రతిజ్ఞ పత్రాన్ని పంపిస్తున్నారు. ఇలా ఒక్కో రకంగా ఓటు నమోదు పెంపునకు అధికార యంత్రాంగం పలు రకాల చర్యలు చేపడుతోంది.

ఆయుధంగా పాయింట్లు..

అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో దాదాపు ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుందనే ప్రచారం ఉంటుంది. ఈ క్రమంలో పోలింగ్ శాతం పెంచేందుకు గాను ఒక్కోసారి ఒక్కో రకమైన అంశాలను ఆయుధంగా ఎంచుకొని ఓటర్లను ఆకట్టుకునేలా అధికార యంత్రాంగం ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఈ క్రమంలో సెల్ఫీ పాయింట్ల వైపు దృష్టి సారించగా.. ఇప్పటికే ఓటు నమోదు, ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించడంతో పాటు ఇటీవల సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేశారు. దీంతో అంతా దాని వైపే మొగ్గు చూపుతున్నారు.



సెల్ఫీ పాయింట్ వద్ద సిరా చుక్క చూపిస్తున్న ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

ఓట్ల పండుగ పేరుతో సెల్ఫీ..



ఓ షాపింగ్ మాల్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్

ఎన్నికల సంఘం పేరుతో ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం, ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ సిటిజన్ ఓట్ల పండుగ పేరుతో రూ.20వేలు ప్రైజ్ మనీ గెలవండి అంటూ రూపొందించిన పాయింట్ అందరిని ఆకట్టుకుంది. పోస్టు సెల్ఫీ ట్యాగింగ్ కలెక్టర్ ఖమ్మం (postselfietagging @ collector_kmm) పేరుతో అందరినీ ఆకట్టుకుంటుంది.

ఆకట్టుకునేలా ఉంది..



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యాన పలు ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఓటు వేసేలా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయం. ప్రతి ఒక్కరూ ఓటు వేయాలనే విధంగా ఈ పాయింట్లను ఏర్పాటు చేయడం శుభపరిణామం.

– లూసికా హాస్య గుజ్జురు, ఖమ్మం

అందరికీ అర్థమయ్యేలా..



పోలింగ్ దగ్గర పడుతున్న క్రమంలో అందరికీ అర్థమయ్యేలా సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయడం బాగుంది. సెల్ఫీ పాయింట్ చూడగానే ఓటు వేయాలనే ఆలోచన వచ్చేలా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో వస్తున్న మార్పుల్లో భాగంగా సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయటం అభినందనీయం.

– ఎస్.సాత్విక, ఖమ్మం

ఓటు వేయాలనిపిస్తోంది..



ఓటు అవగాహన కార్యక్రమాలు చూస్తుంటే ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్పించేలా ఉంది. ఓటు నమోదు నుంచి మొదలు ఓటు వేయాలనే అంశాలపై కళాశాలల్లో అవగాహన కల్పించడం, ప్రధాన కేంద్రాల్లో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయడం కొత్తగా అనిపిస్తోంది.

– జి.కుమార్, ఖమ్మం

బడుగులంటే కాంగ్రెస్‌కు గౌరవం లేదు..

ముదిరాజ్‌ల సమ్మేళనంలో ఎంపీలు వద్దిరాజు, నామా



ఎంపీ వద్దిరాజు, అభ్యర్థి నామాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ శ్వేత

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్‌కు బడుగు, బలహీన వర్గాల ప్రజలంటే ఏ మాత్రం గౌరవం లేదని.. అందుకే మంత్రివర్గంలో ముస్లిం, మున్నూరుకాపు, యాదవ, పద్మశాలీలకు ప్రాతినిధ్యం కల్పించలేదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలో గురువారం కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత ఆధ్వర్యాన నిర్వహించిన ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తనకు ఎంపీగా అవకాశం ఇవ్వగా.. చేవెళ్లలో ముదిరాజ్ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు టికెట్ ఇచ్చారని వద్దిరాజు తెలిపారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ విజయానికి అందరూ పాటుపడాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, నాయకులు డాక్టర్ కిషోర్ బాబు, పిట్టల నాగేశ్వరరావు, పిట్టల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఇక బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే కరెంట్, నీళ్ల కోల్పోగా.. పంటలు ఎండిపోయాయని తెలిపారు. దీంతో ప్రజల్లో మార్పు రాగా.. పథకాలు రాకున్నా లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. కాంగ్రెస్‌లో జిల్లా నేతలను కాదని బయట వ్యక్తిని తీసుకొస్తే.. నామా మాత్రం ఖమ్మంలో గ్రానైట్ పరిశ్రమతో వేలాది మందికి ఉపాధి కల్పించారని తెలిపారు.

నామాను గెలిపించాలని ప్రచారం..

రఘునాథపాలెం: అభివృద్ధి, సంక్షేమం కోసం లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. మండలంలోని చింతగుర్తి, చిమ్మపుడిల్లో నిర్వహించిన ఎన్నికల్లో ప్రచారంలో ఆయన మాట్లాడారు. వైస్ ఎంపీపీ గుత్తా రవి, నాయకులు మద్దినేని వెంకటరమణ, పిన్ని కోటేశ్వరరావు, మెంటం రామారావు, అజ్మీరా వీరూనాయక్, కుతంబాల నరేష్, గొర్రె శ్రీనివాసరావు, తాత వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముందు వరుసలో ఉన్నాం...

నేలకొండపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపునకు ముందు వరుసలో ఉన్నామని బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు తెలిపారు. నేలకొండపల్లి మండల నాయకులతో గురువారం వారు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి మండలంలో పరిస్థితులు, మిగిలిన సమయంలో చేయాల్సిన ప్రచారంపై సూచనలు చేశారు. కాగా, నామా విజయాన్ని కాంక్షిస్తూ గురువారం మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి మండలంలోని బైరవునిపల్లి, రాజేశ్వరపురంల్లో ప్రచారం చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రచారం

కామేపల్లి: మండల వ్యాప్తంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. పాతలింగాలలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గోవింద్రాలలో జెడ్పీటీసీ బానోత్ వెంకటప్రవీణ్‌కుమార్‌నాయక్, పండితాపురంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ ప్రచారం నిర్వహించి చేతి గుర్తుకు ఓటేయాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు కామేపల్లిలో ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు.

'తాండ్ర'ను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ఖమ్మంరూరల్: బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేసి ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బట్టు నాగరాజు తెలిపారు. మండలంలోని నాయుడుపేటలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే రెండు రోజులు పార్టీల కార్యకర్తలు అహర్నిశలు శ్రమించి తాండ్రను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కొప్పుల నాగేశ్వరరావు, పాలస వెంకటేశ్వర్లు, కోటమర్తి సుదర్శన్, వీరెల్లి లక్ష్మయ్య, ఎం.రాంబాబు, నాగరాజు, లంకపల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కామేపల్లి: ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ శ్రీసర్వేష్‌రెడ్డికి గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ స్టేట్ ట్రైబల్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ ఈరునాయక్ వినతిపత్రం సమర్పించారు. ఏజెన్సీ ప్రాంతంలో జీఓఎంఎస్ నంబర్ 3 ద్వారా స్థానిక గిరిజనులకు పదోన్నతులు, నియామకాలు కల్పించాలని, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ పోస్టులు కల్పించాలని, జీఓ 317 ద్వారా ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కిషన్ రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాపాలాల్, బాసు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: మండలంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి నుంచి జక్కేపల్లి పులిపాటి ప్రసాద్ తన బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో సుర్దేపల్లి నుంచి అతి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108లో ఖమ్మంకు తరలించారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి




మృతదేహాల వద్ద సీపీఐ నేతలు

ఖమ్మంమయూరిసెంటర్: గుదిమళ్ల వద్ద ఏటిలో పడి మృతి చెందిన పిల్లల కుటుంబాలను ఆదుకోవాలని సీపీఐ నాయకులతో పాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఈతకు వెళ్లి మృతి చెందిన లోకేష్, హరీష్, గణేష్ మృతదేహాలను మాజీ మంత్రితో పాటు సీపీఐ నాయకులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, ఎస్‌కె జానిమియా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో సందర్శించి.. మృతుల కుటుంబాలను ఓదార్చారు. లోకేష్, హరీష్‌ల తల్లిదండ్రులైన ఆముదాల చిరంజీవి, లక్ష్మిల కుటుంబం రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబమని, గణేష్ తల్లి బానోత్ కళావతి భర్త మృతి చెందినా కాయ కష్టం చేసి కుమారున్ని చదివించుకుంటుందని హేమంత్‌రావు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకునేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మూడు అనాథ శవాలకు అంత్యక్రియలు

ఖమ్మంవైద్యవిభాగం: మూడు మృతదేహాలకు అన్నం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల మధిర, డోర్నకల్ రైల్వే పోలీసుల పరిధిలో ముగ్గురు వ్యక్తులు రైలు ఢీకొని మృతి చెందారు. ఆయా మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించగా.. మృతదేహాల కోసం ఎవ్వరూ రాకపోవడంతో రైల్వే పోలీసుల సమాచారంతో అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యాన బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మృతదేహాల వద్ద ఫౌండేషన్ బాధ్యులు

కాంగ్రెస్ పార్టీలో చేరికల పరంపర



పార్టీలో చేరిన వారితో మంత్రి పొంగులేటి

ఖమ్మంవన్‌టౌన్/కూసుమంచి: అధికార కాంగ్రెస్ పార్టీలో చేరికల పరంపర కొనసాగుతూనే ఉంది. వివిధ పార్టీలకు చెందిన అనేక మంది ప్రజాప్రతినిధులు, నాయకులు గురువారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండల జెడ్పీటీసీ మేరెడ్డి వసంత జనార్దన్‌రెడ్డి, ప్రశాంతినగర్ ఎంపీటీసీ ముక్కెర శిరీషాలతో పాటు తాజా మాజీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, మైనార్టీ నాయకులు, సీనియర్ పార్టీ నాయకులు ఉన్నారు. వీరందరికీ మంత్రి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే కూసుమంచి మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన పెరికిసింగారం ఎంపీటీసీ మోదుగు వీరభద్రం, ఉప సర్పంచ్ ఉప్పల వీరభద్రంలు ఖమ్మంలో మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే నర్సింహులగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ దేగల సీతరాములుతో పాటు బిజిగ శ్రీను, ఉపేందర్, సోమయ్య, యలమంచి తదితరులు ప్రసాదరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఎంపీపీ బాణోతు శ్రీనివాస్‌నాయక్, మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, నాయకులు జొన్నలగడ్డ రవికుమార్, బజ్జూరి వెంకటరెడ్డి, చాట్ల పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్లకు అండగా ఉంటా..

ఖమ్మంఅర్బన్: టీడీపీ, కాంగ్రెస్ కలిసిన తరువాత వార్ వన్‌సైడే అవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ శ్రేణులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో తెలుగు తమ్ముళ్లకు అండగా ఉంటానని, రాబోయే లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి వెంకటేశ్వర్లు, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి గుత్తా సీతయ్య, ఖమ్మం నగర అధ్యక్షుడు వడ్డేం విజయ్‌లతో పాటు మండిపూడి శ్రీనివాసరావు, ప్యారిస్ వెంకన్న, గుండెపిన్ని నాగేశ్వరావు, నాగండ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెను గెలిపించాలి



కూసుమంచి: మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమామిళ్లగూడెం/కూసుమంచి: అవినీతి, మతోన్మాద శక్తులతో పనిచేస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని, రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్‌ను గెలిపించాల్సిన అవసరం ఉందని జమియతే ఉల్మాయేహింద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌలానా మోహమ్మద్ సయూద్ అహ్మద్ ఖాస్మీ, ముఫ్తీ జలాలుద్దీన్, ప్రముఖ విద్యావేత్త ఎండీ అసద్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో జమియతే ఉల్మామయేహింద్ బాధ్యులు, కూసుమంచి పార్టీ కార్యాలయంలో నున్నా మాట్లాడారు. కేంద్రంలో గత పదేళ్లుగా అధికారంలో ఉన్న మోదీ ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు ధారాదత్తం చేయడం, ధనికులను మరింత ధనికులుగా చేయడం తప్ప ఆయన చేసిందేమీ లేదన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికే కాకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన రిజర్వేషన్లు ప్రమాదంలో పడే అవకాశముందని, బీజేపీపి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. ఖమ్మం ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే బీసీల మద్దతు కాంగ్రెస్‌కే ఉంటుందని జాతీయ బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి తెలిపారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఉపాధ్యక్షుడు మౌలానా ముజహిద్, మౌలానాసత్తార్ ఖాస్మీ, మౌలానా అబ్దుల్ గని, ముఫ్తిఅబ్దుల్ రవూఫ్, హాఫీజ్ జమీల్ అహ్మద్, హాఫీజ్ జకీఉల్లా, కూసుమంచి మండల ఇన్‌చార్జ్ బుగ్గవీటి సరళ, కార్యదర్శి ఎడవెల్లి రమణారెడ్డి, నాయకులు సన్మంతరావు, గురుమూర్తి, పుల్లారావు, సుగుణ, రామ్మోహన్, వెంకటరామయ్య, నాగేశ్వరరావు, బచ్చలపద్మాచారి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల మద్దతు..

ఖమ్మంవన్‌టౌన్: తొలి నుంచి కాంగ్రెస్ పార్టీ ముస్లింల పక్షపాతి అని, ఈ సారి ఎన్నికల్లో తమ మద్దతు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘురాంరెడ్డికే ఉంటుందని గురువారం తుమ్మలగడ్డ మజీద్ వెనుక ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మైనార్టీలు ప్రకటించారు. మైనార్టీ జిల్లా నాయకులు ఎస్‌కె.వియాభాయ్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సమ్మేళనంలో రఘురాంరెడ్డి హాజరవ్వగా మతపెద్దలు, యువకులు రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు.

రఘురాంరెడ్డిని గెలుపునకు ప్రచారం..



నేలకొండపల్లిలో ప్రచారం చేస్తున్న అంజని

ఖమ్మంమయూరిసెంటర్/తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: సీపీఎం బలపరిచిన ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మం, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. గురువారం ఈమేరకు ఖమ్మం పీఆర్‌టీయూ ఆఫీస్ రోడ్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ ఆధ్వర్యాన, 51వ డివిజన్‌లో సీపీఐ జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు పోటు కళావతి ఆధ్వర్యాన, తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయిలో కాంగ్రెస్ నాయకులు, నేలకొండపల్లిలోని పలు వార్డుల్లో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని ఆధ్వర్యాన విస్తృతంగా ప్రచారం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ రానున్న కాలంలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, అందుకు రఘురాంరెడ్డి హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్,వైస్ ఎంపీపీ బుద్దా వంశీకృష్ణ, మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి సరిత, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, నాయకులు డి.నాగరాజు, రామారావు, పి.నాగేశ్వరరావు, బుద్దా కనకయ్య, ఉప్పనూతల నాగేశ్వరరావు, గూడూరు ఉపేందర్, సాయినవీన్, పగిడికత్తుల సుదర్శన్, కోడిరెక్కల వినోద్, కడియాల నరేష్, శ్రీకాంత్, జ్వాల నరసింహరావు, జ్వాల శ్రీను, అనసూర్య, మణి, బి.కళావతి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం రద్దు చేసే బీజేపీని ఓడించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ రాజా

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ రాజ్యాంగం రద్దు చేసే ప్రమాదముందని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా అన్నారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి వీరూనాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఓటమి భయంతో మోదీ అసహనంతో మాట్లాడుతూ విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, ఆయనపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేసిందని, దేశ సంపద, సహజ వనరులను అదాని, అంబానీలకు దోచి పట్టిందని, నిరుద్యోగులకు ఉద్యోగాల పేరుతో మోసంచేసిందన్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిందుకు, ప్రజల హక్కులను కాపాడేందుకు ఇండియా కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఫాసిస్టు శక్తులనుఓడించి గుణపాఠం చెప్పాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా నాయకులు బానోతు శ్రీను, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్ట్ 'సంగబత్తుల'

కూసుమంచి: ఆదర్శ కమ్యూనిస్ట్ యోధుడిగా తన తుదిశ్వాస వరకు పోరాడిన తెలంగాణ సాయుధ పోరాటయోధుడు సంగబత్తుల వెంకటరెడ్డి అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. గురువారం మండలంలోని గైగోళ్లపల్లి గ్రామంలో నిర్వహించిన వెంకటరెడ్డి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. పేదల కోసం, ప్రజాసమస్యలపై పార్టీ చేపట్టిన పోరాటాల్లో ఆయన ముందు నిలిచారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సహాయ కార్యదర్శి దండి సురేష్, మండల కార్యదర్శి భూకాయ నరసింహాతో పాటు నాయకులు నర్సింహారావు, రామ్మూర్తి, మల్లేష్, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, హనుమంతరావు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాగం హేమంతరావు